
అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 301 | శుక్రవారం 29 ఆగస్టు 2025 | పేజీలు : 4 | వెల : 3/-











## బీజేపీ, బీఆర్ఎస్...

# విలీనమేనా?

- అన్నింటికంటే ఎక్కువగా వరదల్లో ఈ బురద రాజకీయం ఎందుకంటూ ఇద్దరు ఒక మెట్టు దిగి ఉండవచ్చు
- అంతమాత్రాన అది అక్కడితోనే ఆగిపోదు. ఇప్పుడు అసలే సోషల్ మీడియా కాలం..
- చీమ చిట్టుకు మన్నా సరే రకరకాల ప్రచారాలు.. రకరకాల ఊహగానాలు తెరపైకి వస్తాయి.
- 2028 ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఇదే జరుగుతుంది.. ఇప్పటికే చర్చలు పూర్తయ్యాయి
- అందువల్లే బిజెపి నాయకులు గులాబీ నాయకుల మీద..
- గులాబీ నాయకులు బిజెపి నాయకుల మీద విమర్శలు చేయడం లేదని రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

బండి సంజయ్, కేటీఆర్ యాదృచ్ఛికంగానే కలిసి ఉండవచ్చు.. వరద బాధితులను కాపాడాలనే కృత నిశ్చయం వారిద్దరిలోనూ ఉండవచ్చు. అన్నింటికంటే ఎక్కువగా వరదల్లో ఈ బురద రాజకీయం ఎందుకంటూ ఇద్దరు ఒక మెట్టు దిగి ఉండవచ్చు. అంతమాత్రాన అది అక్కడితోనే ఆగిపోదు. ఇప్పుడు అసలే సోషల్ మీడియా కాలం.. చీమ చిట్టుకు మన్నా సరే రకరకాల ప్రచారాలు.. రకరకాల ఊహగానాలు తెరపైకి వస్తాయి. ఆ తర్వాత జరగాల్సిన పని జరిగిపోతూ ఉంటుంది. దానివల్ల సమాజానికి ఉపయోగం ఉంటుందా.. లేదా.. అనే విషయాలను పక్కన పెడితే జరగాల్సిన చర్చ జరుగుతూనే ఉంటుంది. ఇప్పుడు తెలంగాణలో కూడా ఒక రకమైన చర్చ నడుస్తోంది.బండి సంజయ్, కేటీఆర్ పరస్పరం తారసపడ్డారు కాబట్టి.. ఇదేది యాదృచ్ఛికమైన కలయిక కాదు. వారిద్దరూ - మిగతా3లో



## ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా

# తీర్చిదిద్దుతాం

### రాష్ట్ర సచివాలయంలో ఆర్వో ప్లాంట్ ప్రారంభం

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

వచ్చే ఏడాది జూన్ 5వ తేది ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. ఇందులో భాగంగానే రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలో ఈనెల 15వతేదీ నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. ఈప్రక్రియలో భాగంగా ప్లాస్టిక్ తాగునీటి బాటిళ్ళ స్థానే స్టెయిన్ లెస్ స్టీల్,గాజు సీసాలతో సురక్షిత తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ను శుక్రవారం - మిగతా3లో

## వ్యవసాయ ఆధారిత పరిశ్రమల గ్లోబల్ హబ్‌గా

# ఏపీని తీర్చిదిద్దుతా

- మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలితో పెట్టుబడి అవకాశాలు
- విశాఖలో ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు
- వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభదాయకంగా సుస్థిరంగా మార్చటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది
- ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఈ పరిశ్రమ విలువ ప్రస్తుతం 8 ట్రిలియన్ డాలర్లుగా ఉంది
- భారత్ కూడా 2030 నాటికి 700 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేస్తోంది




**అంకుశం ప్రత్యేక ప్రతినిధి విశాఖపట్నం**

ఆంధ్రప్రదేశ్‌ను ఫుడ్ ప్రాసెసింగ్, ఆక్వా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులను ఈ రంగాల్లో సాధిస్తామని సీఎం పేర్కొన్నారు. శుక్రవారం విశాఖలో ట్రేడ్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఇండియా ఫుడ్ మాన్యుఫాక్చరింగ్ సమ్మిట్ కు ముఖ్యమంత్రి హాజర య్యారు. వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభదాయ కంగా సుస్థిరంగా మార్చటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని సీఎం అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా ఈ పరిశ్రమ విలువ - మిగతా3లో



# ‘ఓటు చోరీ’తోనే నాడు ఓడిపోయా..

- సిద్ధరామయ్య సెల్ఫ్ గోల్!
- “1991లో లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయా
- ఆ ఎన్నికల్లో అవకతవకలు జరగడం వల్లే ప్రతికూల ఫలితం వచ్చింది



# ఏమాత్రం సిగ్గున్నా క్షమాపణలు చెప్పాల్సిందే

- “రెండు రోజుల కిందట జరిగిన ఘటన..ప్రతీ ఒక్కరినీ బాధించింది
- మోదీ తల్లి ఒక పేద కుటుంబంలో విలువలతో బిడ్డలను పెంచింది
- అలాంటి తల్లి జీవితాన్ని అవమానించడాన్ని భారతీయలెవరూ సహించలేరు
- రాజకీయ జీవితంలో ఇంతకన్నా దిగజారుడు తనం ఇంకొటి లేదు

# అసెంబ్లీలో అర్థవంతమైన చర్చల కోసం ఏఐ వినియోగం

### నాలెడ్జ్ బేస్డ్ ఎకానమీలో చార్టర్డ్ ఎకౌంటెంట్లు భాగస్వాములు కావాలి

### నాలుగేళ్లలో విశాఖ రూపురేఖలు మార్చుతాం

### చార్టర్డ్ అకౌంటెంట్లకు రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ పిలుపు



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి విశాఖపట్నం**

అసెంబ్లీ సమావేశాల్లో అర్థవంతమైన చర్చల కోసం ఏఐని వినియోగిస్తామని ఐటి, ఎలక్ట్రానిక్స్, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఐసిఎఐఆధ్వ ర్యాన అర్థసమృద్ధి - 2025 పేరిట వైజాగ్ కన్వెన్షన్స్ లో శుక్రవారం జరిగిన సదస్సులో మంత్రి లోకేష్ ముఖ్యఅ తిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. దార్శనిక ముఖ్యమంత్రి చంద్రబాబునా యుడు నేతత్వంలో ఎపి లోని కూటమి ప్రభుత్వం నాలెడ్జ్ బేస్డ్ ఎకానమీని నిర్మిస్తోంది. ఈ ప్రయాణంలో చార్టర్డ్ అకౌంటెంట్లు కంట్రిబ్యూటర్లుగా మాత్రమే కా కుండా మార్గదర్శకులుగా నిలవాలి. ప్రతి పారిశ్రామిక విప్లవానికి రెండు పార్శ్వాలు ఉంటాయి, ప్రతి పారిశ్రామిక విప్లవం కొత్త అవకాశాలను సష్టిస్తుంది, గతంలో ఐటి విప్లవం వచ్చినపుడు భారతదేశం అత్యధికంగా లబ్ధిపొందింది, అదేతరహాలో ప్రస్తుతం ఎఐ విప్లవంతో లబ్ధిపొందబోతున్నాం. రాజకీయ పార్టీగా మేం డిజిటల్ లైబ్రరీ, విశ్లేషణాత్మక - మిగతా3లో

# అందుకు భారత్-చైనా కలిసి పని చేయాలి

- ప్రధాని నరేంద్ర మోదీ
- ప్రపంచ ఆర్థిక క్రమానికి ఓ స్థిరత్వాన్ని తీసుకురావాలంటే ఇరుదేశాలు ముందడుగు వేయక తప్పదు
- భారత్-చైనాల మధ్య బలపడనున్న స్థిరమైన, స్నేహపూర్వక ద్వైపాక్షిక సంబంధాలు ప్రాంతీయ, ప్రపంచ శాంతి, శ్రేయస్సుపై సానుకూల ప్రభావాన్ని చూపుతాయి



# క్షమించేదే లే...



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయనలో చాలా మార్పు కనిపిస్తుంది. అభివృద్ధి, సంక్షేమ పథకాలను తీసుకెళ్లడంలో దృష్టి పెట్టడం పక్కన పెడితే మిగిలిన విషయాల్లో ఆయన ఖచ్చితంగా వ్యవహరిస్తున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు మూడు దఫాలు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా తీసుకోని రాజకీయ పరమైన నిర్ణయాలు ఈ సారి మాత్రం తీసుకుంటున్నారు. చంద్రబాబు నాయుడు గతంలో ఎమ్మెల్యేలు కానీ, మంత్రులు కానీ ఏమైనా తప్పులు చేస్తే వెంటనే చర్యలకు దిగేవారు కాదు. దానిపై సాగదీసేవారు. నాడు సోషల్ మీడియా ప్రభావం కూడా తక్కువగా ఉండటంతో అటువంటి ఘటనలపై నిజనిర్ధారణ కమిటీలను వేసేవారు. పార్టీ వారినే పంపి అందులో నిజాలను తెలుసుకునే ప్రయత్నం చేసేవారు. అయితే అంతకు ముందు అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్న పోచారం శ్రీనివాస రెడ్డిని మంత్రి పదవి నుంచి తప్పించారు. అంతే తప్ప మంత్రులు, ఎమ్మెల్యేలపై తీసుకున్న చర్యలు చాలా తక్కువనే చెప్పాలి. ఎక్కువగా పార్టీ క్రమశిక్షణ కమిటీ, నిజనిర్ధారణ కమిటీలను నియమించి కాలయాపన చేస్తూ ఆ ఘటన మర్చిపోయిన తర్వాత షరా మామూలయ్యేది. కానీ ఇప్పుడు అలా కాదు. వెను వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు. సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంపై లైంగిక వేధింపుల విషయం తెలిసిన వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. తర్వాత తాజాగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిపై కేసు నమోదు చేయించారు. ఇలాంటి పరిస్థితులు గతంలో ఉండేవి కావని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు. ఇక గతంలో ప్రజా సమస్యలపై ఎవరైనా ఆందోళనలు చేసినా వెంటనే స్పందించే వారు కాదు. అలాగే విపక్ష నేతలు వెళ్లి అక్కడ పర్యటనలు చేసినా పట్టించుకునే వారు కాదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో విద్యుత్తు ఛార్జీల పెంపుదలపై ఆయన కఠినంగా వ్యవహరించారు నాడు. కానీ నేడు అలా కాదు. ఏ మాత్రం నిరసనలు, ఆందోళనలు కనిపించినా వెంటనే చంద్రబాబు రియాక్ట్ అవుతున్నారు. మిరప, పొగాకు, చిత్తూరు మామిడి రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతో విపక్ష నేత అక్కడ పర్యటనలకు చేయకముందే ఆ సమస్యపై స్పందించారు. తాజాగా దివ్యాంగులను నెలకు పదిహేను వేల రూపాయల పింఛన్లు తొలగించారన్న ఆరోపణల నేపథ్యంలో ఆందోళనకు దిగితే వెంటనే స్పందించి అర్హులైన అందరికీ ఇస్తామని ఆయనే చెప్పారు. ఇక స్మార్ట్ మీటర్ల విషయంలోనూ ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న చంద్రబాబు కమర్షియల్ భవనాలకే పరిమితం చేయడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. చంద్రబాబులో వచ్చిన ఈ మార్పు చూసిన పార్టీ సీనియర్ నేతలు మాత్రం ఆశ్చర్యపోతున్నారు

దసరాకు 6 లక్షల మందికి గృహప్రవేశాలు

. దసరా పండగకు భారీ బహుమతి ఇచ్చేందుకు సిద్ధమయింది. మూడు లక్షల ఇళ్ల లో గృహప్రవేశాలు చేయాలని నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరసగా సంక్షేమ పథకాలను అమలు చేయడం ప్రారంభించింది. ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కాలం పూర్తి కావడంతో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల ఆదరిభామానాలను చూరగొనే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగా ఈ దసరా పండగ నాడు మూడు లక్షల ఇళ్లలో గృహ ప్రవేశాలు చేయించాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.దసరాకు మూడు లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు చేయించడంతో పాటు రానున్న సంక్రాంతి నాటికి మరో రెండు లక్షల ఇళ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులకు చంద్రబాబు ఆదేశించారు. అంటే ఈ ఏడాది దాదాపు ఐదు లక్షల మంది ఇళ్లులేని పేదలకు సొంత ఇంటి కల సాకారమవుతుందని భావిస్తున్నారు. సొంత ఇంటికోసం కొన్నేళ్లుగా ఎదురు చూస్తున్న పేదలకు ప్రభుత్వం తీపికబురు అందించినట్లయింది. వేగంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పది లక్షల మందికి సొంత ఇళ్లను సమకూర్చాలన్న ఉద్దేశ్యంలో ప్రభుత్వం ఉంది. . ఇందుకు అనుగుణంగా కేటగిరీలుగా విభజించి వాటిని పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో జరిపిన సర్వే ప్రకారం ఇప్పటి వరకూ ఆరు లక్షల మందికి సొంత ఇళ్లు కావాలని తేలింది. దీంతో వచ్చే ఏడాదికి ఆరు లక్షల మందికి సొంత ఇళ్లను అందించేలా ప్రణాళికలను రూపొందించారు. ఈ మేరకు అధికారులు పనులను ముమ్మరంపూర్తి చేశారు. ఇప్పటికే అనేక గృహాలు నిర్మాణానికి తుది దశకు చేరుకున్నాయి. మరికొన్నింటిలో చిన్న చిన్న పనులు ఉన్నాయి. అవి దసరా నాటికి పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అదే సమయంలో నిధులకు సంబంధించిన ఇబ్బందులు కూడా లేకపోవడంతో గృహ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

## తెలుగు ప్రజలు సమైక్యంగా ఉండాలని

# పోరాడిన నేత నందమూరి హరికృష్ణ

**– ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయంలో నందమూరి హరికృష్ణ 7వ వర్ధంతి వేడుకలు**




**అంకుశం న్యూస్ విజయవాడ ఆగస్ట్ 29:** నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించిన నాటి నుంచి పార్టీ విజయం కోసం అహర్నిశలు శ్రమించినా..ఏనాడు పదవుల కోసం పాకులాడలేదని, రాష్ట్రం సమైక్యంగా వుండాలన్న లక్ష్యంతో రాజ్య సభ సభ్యత్వాన్ని కూడా తృణప్రాయంగా వదులుకున్ననాయకుడు నందమూరి హరికృష్ణ అంటూ వక్తలు ఆయన సేవలను కొనియాడారు.. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో రాజ్య సభ మాజీ ఎంపీ, మాజీ రావాణా శాఖ మంత్రి, టిడిపి మాజీ పోలిట్ బ్యూరో సభ్యుడు నందమూరి హరికృష్ణ 7వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. నందమూరి హరికృష్ణ చిత్ర పటానికి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, శాలివాహన కుమ్మరి సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పెరేపి ఈశ్వర్ మాజీ వుడా చైర్మన్ తుమ్మాటి ప్రేమనాథ్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ లతో పాటు టిడిపి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, మాజీ వుడా చైర్మన్ తుమ్మాటి ప్రేమనాథ్, మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ మాట్లాడతూ

ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన తర్వాత కొన్ని వేల కిలోమీటర్లు రాష్ట్ర వ్యాప్తంగా సురక్షితంగా పర్యటించటానికి కారణం చైతన్య రథానికి రథసారథిగా హరికృష్ణ వుండటం అన్నారు. హరికృష్ణ ఎన్టీఆర్ తనయుడి గానే కాకుండా తెలుగుదేశం పార్టీ సైనికుడిగా అహర్నిశలు శ్రమించి పార్టీ విజయం సాధించటంలో కీలక భూమిక పోషించారని ఆయన సేవలు గుర్తు చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాలు సమైక్యంగా వుండాలన్న హరికృష్ణ రాజ్యసభలో చేసిన ప్రసంగం ఇప్పటికి అందరిలో భావోద్వేగం కలుగుజేస్తాయన్నారు. నందమూరి హరికృష్ణ ఆశయ సాధన కోసం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షుడు చలసాని రమణ, పాటు టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# వచ్చేస్తున్న ఫ్యామిలీ కార్డులు

**గుంటూరు :** ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి దాదాపు 15 నెలలు అవుతోంది. పాలనతో పాటు సంక్షేమ పథకాలను పట్టాలు ఎక్కించారు ఏపీ సీఎం చంద్రబాబు. ఈ తరుణంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఇంటికి రేషన్ కార్డ్, ఆధార్ కార్డు మాదిరిగా.. ఫ్యామిలీ కార్డు ఇవ్వాలని నిర్ణయించారు. స్వయంగా ఆ విషయాన్ని సీఎం చంద్రబాబు ప్రకటించారు. వాస్తవానికి సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలకు వ్యతిరేకం అని ప్రత్యర్థులు ప్రచారం చేశారు. కానీ అందుకు విరుద్ధంగా వ్యవహరించారు చంద్రబాబు. పాలనను గాడిలో పెడుతూనే.. సంక్షేమ పథకాలను అమలు చేయడం ప్రారంభించారు. అధికారంలోకి వచ్చింది మొదలు సంక్షేమ పథకాలను అమలు చేయడం మొదలుపెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని పెంచి.. తనకంటూ ఒక కొత్త ముద్రను చాటుకున్నారు చంద్రబాబు. గతానికి భిన్నంగా వ్యవహరించారు. మూడు వేల రూపాయలు ఉన్న పెన్షన్ మొత్తాన్ని ఏకకాలంలో నాలుగు వేల రూపాయలకు పెంచి చూపించారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాల పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. అసలు ఆచరణ సాధ్యం కానీ హామీలు ఇచ్చారని ప్రత్యర్థులు ప్రచారం చేశారు. కానీ దానిని సుసాధ్యం చేసి చూపించారు చంద్రబాబు.చంద్రబాబు ట్రాక్ రికార్డును చూసుకుంటే పాలనాపరంగా ముద్ర చాటుకున్నారే తప్ప సంక్షేమ పథకాల విషయంలో.. పెద్దగా ప్రభావం చూపింది తక్కువ. కానీ 2019, 2024 మధ్య జరిగిన పరిణామాలు ఆయనలో మార్పుకు కారణమయ్యాయి. ప్రజలు అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని కోరుకుంటున్నట్లు అర్థమైంది. అందుకే అభివృద్ధి తో పాటు సంక్షేమ పథకాలకు ప్రాధాన్యం ఇచ్చారు చంద్రబాబు. అందులో భాగంగానే సూపర్ సిక్స్ పథకాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే చంద్రబాబు అధికారంలోకి వచ్చేందుకే ఈ తరహా హామీలు ఇచ్చారని అంతా భావించారు. చివరకు సొంత పార్టీ శ్రేణులతో పాటు కూటమి పార్టీల శ్రేణులు కూడా అలానే భావించాయి. కానీ అనూహ్యంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయడం ప్రారంభించారు చంద్రబాబు. ముఖ్యంగా పింఛన్ మొత్తాన్ని 3,000 నుంచి 4 వేల రూపాయలకు పెంచిన ఘనత చంద్రబాబుదే. అంతకుముందు జగన్మోహన్ రెడ్డి ఏడాదికి రూ.250 పెంచుకుంటూ పోతూ.. మూడు వేల రూపాయలకు చేరుకున్నారే తప్ప.. ఏకకాలంలో పెంచలేకపోయారు. కానీ చంద్రబాబు మాత్రం మూడు వేల రూపాయల నుంచి ఏకకాలంలో 4వేల రూపాయలకు పెంచారు. మూడు నెలల బకాయిని సైతం అందించారు. అంతటితో చంద్రబాబు సంక్షేమం ఆగలేదు. మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం, ఆపై అన్న క్యాంటీన్ల ప్రారంభం వంటి పథకాలను అమలు చేశారు.అయితే చంద్రబాబు అమలు చేసిన పథకాల విషయంలో ప్రత్యర్థులు విరుద్ధంగా ప్రచారం చేశారు. ప్రధాన పథకాలను విస్మరించి.. తక్కువ ఖర్చుతో కూడిన పథకాలను మాత్రమే అమలు చేశారని ఆరోపణలు చేశారు. అందుకే చంద్రబాబు ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంలో ప్రధానమైన పథకాలకు శ్రీకారం చుట్టారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 13 వేల రూపాయల చొప్పున సాయం అందించారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేసి కేంద్రం అమలు చేసిన పీఎం కిసాన్ తో కలిపి ఏడు వేల రూపాయలు అందించగలిగారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం సైతం మొదలుపెట్టారు. ఏకకాలంలో 5 ఏపీఎస్ఆర్టీసీ సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించారు. తద్వారా సూపర్ సిక్స్ పథకాల్లో దాదాపు అన్ని పథకాలను అమలు చేశారు. ఇప్పుడు రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులు కింద మార్చి అందించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలకు ఇన్ని చేసిన చంద్రబాబు.. వారు గుర్తించే విధంగా సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి ఎంత వర్తించిందో తెలియజెప్పే విధంగా ఫ్యామిలీ కార్డ్ అందించాలని నిర్ణయించారు. ఒకవైపు అభివృద్ధి.. మంచి పాలన అందించి.. ఇప్పుడు ఫ్యామిలీ కార్డు ద్వారా ప్రతి కుటుంబం ఎంత లబ్ధి పొందిందో.. వారికి తెలియజెప్పే విధంగా తాజాగా ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.



## వ్యవసాయ ఆధారిత పరిశ్రమల గ్లోబల్ హబ్‌గా ఏపీని తీర్చి దిద్దుతా

-మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం 8 ట్రిలియన్ డాలర్లుగా ఉందని.. భారత్ కూడా 2030 నాటికి 700 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా వేస్తోందని అన్నారు. ఈ రంగంలో భారత్ మరింత వేగంగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఫుడ్ ప్రాసెసింగ్ లో ఏపీ 9 శాతం వాటాతో 50 బిలియన్ డాలర్ల విలువను కలిగి ఉందని అన్నారు. అలాగే జీఎస్డీపీలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల వాటా 35 శాతంతో రూ.5.19 లక్షల కోట్లుగా ఉందన్నారు. త్వరలోనే ఏపీ ఫ్రూట్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా అవతరిస్తుందని.. దేశంలోని ఉత్పత్తిలో 25 శాతం వాటాకు చేరుకుంటామని సీఎం తెలిపారు. అలాగే 2.26 లక్షల హెక్టార్లలో ఆక్వా కల్చర్ సాగు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆక్వా హబ్ గా ఉందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే విస్తతమైన మౌలిక సదుపాయాలు కూడా ఏపీ సొంతమని పెట్టుబడి దారులు, ఎగుమతిదారులకు వివరించారు. రాష్ట్రంలో 9 ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్కులు, 17 లక్షల మెట్రిక్ టన్నుల కోల్డ్ స్టోరేజ్, 33 లక్షల టన్నుల సరకు నిల్వ చేసేందుకు గోదాములు ఉన్నాయని అన్నారు. ఫుడ్, బెవరేజ్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. చిత్తూరు, గుంటూరు, కోస్తాంధ్ర, విశాఖ జిల్లాల్లో పండ్లు, మసాలా దినుసులు, ఆక్వా, కోకో, కాఫీ క్లస్టర్లు ఉన్నాయని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ 4.0 కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, రూ.200 కోట్లకు పైగా పెట్టుబడులు దాటితే వాటిని మెగా ప్రాజెక్టులుగా పరిగణించి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామని సీఎం వెల్లడించారు. గత ఏడాది రాష్ట్రానికి ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. ప్రజల ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలితో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపారమైన అవకాశాలు వస్తున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. పెట్టుబడులకు ఇదే సరైన సమయం అని సీఎం పిలుపునిచ్చారు. ఈ రంగంలో వచ్చే ఎంఎస్ఎంఈలను కూడా ప్రోత్సహించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంపూర్ణ సహకారం అందిస్తున్నాయని అన్నారు. ఈ సమావేశానికి ఏపీ మంత్రులు టీజీ భరత్, డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టీపీసీఐ చైర్మన్ మోహిత్ సింగ్లా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, పారిశ్రామిక ప్రతినిధులు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఎగుమతి దారులు, నిపుణులు హాజరయ్యారు.

## ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

-మొదటిపేజీ తరువాయి

3వ భవనంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ప్రారంభించారు.ఒక సారి వినియోగించి పడవేసే(సింగిల్ యూజ్)ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా రాష్ట్ర సచివాలయంలో పనిచేసే ప్రతి ఒక్కరూ స్టీల్ లేదా గాజు సీసాల్లోనే మంచినీటిని తాగాలని ఉద్యోగులు అందరికీ ఉచితంగా స్టెయిన్ లెస్ స్టీల్ మంచినీటి బాటిళ్ళను పంపిణీ చేయడం జరిగింది.బయటి నుండి వచ్చే సందర్శకులు కూడా సచివాలయంలోకి ప్లాస్టిక్ మంచినీటి బాటిళ్ళు,ఇతర ప్లాస్టిక్ వస్తువులు తీసుకురాకుండా చర్యలు తీసుకుంటున్నారు.ప్రతి ఒక్కరికీ సురక్షిత తాగునీరు అందించేందుకు సిఆర్డిఏ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేకంగా 8ఆర్వో(రివర్సు ఆస్మాసిస్)ప్లాంట్లను ఏర్పాటు చేయడంతోపాటు 32 వాటర్ డిస్పెనింగ్ యూనిట్లను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని సిఎస్ విజయానంద్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన ఎపి సచివాలయంలో ఈనెల 15 వతేదీ నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించామని దశల వారీగా రాష్ట్రం అంతటా దీనిని అమలు చేయడం జరుగుతుందని తెలిపారు.వచ్చే ఏడాది జూన్ 5వతేది ప్రపంచ పర్యావరణ దినోత్సవం నాటికి రాష్ట్రాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన పునరుద్ఘాటించారు.దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలందరికీ పూర్తి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేర్కొన్నారు. ఆర్వో ప్లాంటులు లేదా వాటర్ డిస్పెన్సింగ్ యూనిట్ల నుండి ఉద్యోగులు వారికి పంపిణీ చేసిన స్టెయిన్ లెస్ స్టీల్ వాటర్ బాటిళ్ళతో ఉచితంగా మంచినీరు తీసుకోవచ్చని సిఎస్ విజయానంద్ తెలిపారు.ఎపి సచివాలయం లోని ప్రతి భవనం,అసెంబ్లీ భవనంలోను ఒక్కొక్కటి గంటకు 1000 లీటర్ల మంచినీటిని అందించే విధంగా 8 ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 500 మిల్లీ లీటర్ల వివిధ బ్రాండ్ల మంచినీటి ప్లాస్టిక్ బాటిల్ ఖరీదు 8 రూ.లు ఉండగా ఇక్కడ ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటు ద్వారా కేవలం బాటిల్ 3రూ.లకే అందించడం జరుగుతుంది.క్యాంటీన్ లో కూడా పూర్తిగా ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ళను నిషేధించగా ఈఆర్వో ప్లాంట్ల ద్వారా 500 మిల్లీలీటర్ల బాటిల్ ను 3రూ.లకే క్యాంటీన్ కు సరఫరా చేయనున్నారు. కార్యక్రమంలో ఎంఏయుడి ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్,జిఏడి ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ కుమార్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో అర్థవంతమైన చర్చల కోసం ఏఐ వినియోగం

-మొదటిపేజీ తరువాయి




సమాచారం కోసం ఎఐ వినియోగిస్తున్నాం, అసెంబ్లీలో అర్థవంతమైన చర్చల కోసం ఎఐ టూల్ ను ఉపయోగిస్తాం. ఎఐ ఆధారిత గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కషిచేస్తున్నాం. ఒకే రాజధాని, అభివద్ధి వికేంద్రీకరణ మా నినాదం. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివద్ధికి ప్రాధాన్యతనిస్తున్నాం. రాయలసీమలోని అనంతపురంలో ఆటోమోటివ్, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, ప్రకాశం జిల్లాలో సిబిజి, గుంటూరు%-% కష్ణా జిల్లాలో క్వాంటమ్ వ్యాలీ, గోదావరి జిల్లాల్లో ఆక్వా, ఉత్తరాంధ్రలో ఐటి, ఫార్మా, లాజిస్టిక్స్ పరిశ్రమలకు ప్రాధాన్యత నిస్తున్నాం. ఇఅ లు (చార్టర్డ్ అకౌంటెంట్స్) నైతికతతో మెరుగైన పాలసీలను అమలు చేయడంలో మాకు సహాయం అందించాలి. పాలసీలను సరైన దిశలో నడిపించడంలో, అభివద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో ముఖ్యమైన పాత్ర పోషించాలి.

సిఎలు ఆంధ్ర ప్రదేశ్ బ్రాండ్ అంబాసడర్‌గా నిలవాలి. టారిఫ్ వార్ కారణంగా భారత్ నష్టపోకుండా కొత్త మార్కెట్లను అన్వేషించాలి. ఈజ్ ఆఫ్ లివింగ్ కు ప్రాధాన్యతనిస్తూ మనమిత్ర ద్వారా 700రకాల పౌరసేవలను వాట్సాప్ ద్వారా అందిస్తున్నాం. పరిపాలన వ్యవహారాల్లో ఎఐ వినియోగానికి సంబంధించి టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ తో ఒప్పందం చేసుకున్నాం. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మేం ఏర్పాటుచేసిన వర్కింగ్ గ్రూపులో చేరి మీవంతు సూచనలు, సలహాలు అందించండి. మీరు కేవలం రికార్డు కీపర్లు మాత్రమే కాదు... భారతదేశ నిర్మాణ రూపశిల్పులు. విశ్వసనీయమైన గణాంకాలు ఉన్న దేశం అన్నివిధాల అభివద్ధి సాధిస్తుంది. ఆ విశ్వాసానికి ప్రతిరూపం ఆడిటర్లు. ఈ సమావేశాన్ని సిటీ ఆఫ్ డెస్టినీ విశాఖపట్నంలో జరపడం సముచితమైన నిర్ణయం. ఆంధ్రప్రదేశ్ కు డీప్ వాటర్ పోర్టు, ఐటి, ఫార్మా, మెడిటెక్ పరిశ్రమలు మణిహారం లాంటివి. చంద్రబాబుగారి విజన్ ప్రకారం విశాఖపట్నం అభివద్ధి చెందితే యావత్ ఆంధ్రప్రదేశ్ అభివద్ధి సాధిస్తుంది. నేడు విశాఖపట్నం సిటీ ఆఫ్ డెస్టినీ మాత్రమే కాదు... ప్రపంచస్థాయి ఫైనాన్స్, ఇన్నొవేషన్, టెక్నాలజీకి కేంద్రబిందువుగా రూపుదిద్దుకుంటోంది. ఐసిఎఐ ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ విశాఖపట్నం వారు కావడం ఆంధ్రప్రదేశ్ లోని సిఎలకు గర్వకారణం. క్రమశిక్షణతో కూడిన ఉత్తమ నాయకత్వానికి ఎల్లలు ఉండవనడానికి ఆయన సాధించిన విజయమే నిదర్శనం. సంపదసష్టి మార్గాలను అన్వేషించండి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఐసిఎఐ ఉపాధ్యక్షులు ప్రసన్నకుమార్, సదరన్ రీజియన్ వైస్ చైర్మన్ ముప్పాళ్ళ సుబ్బారావు, ఐసిఎఐ విశాఖ బ్రాంచి ప్రతినిధులు అందవరపు శ్రీధర్, రామానాయుడు, పట్నాల లోకేష్, ఉజ్వల, లీలా వరప్రసాద్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కామన్ ఫెసిలిటీ సెంటర్స్ న్యూ ఏర్పాటు చేయండి




- ఎంపీ కేశినేని శివనాథ్
- హైదరాబాద్ లో ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్ సంస్థ డైరెక్టర్ జనరల్ జి.నరేంద్రతో భేటీ
- జిల్లాలోని 295 గ్రామాల సమగ్ర అభివృద్ధి పై కూలంకుషంగా చర్చ

**అంకుశం ప్రతినిధి విజయవాడ : ఆగస్టు 29 :**ఎన్టీఆర్ జిల్లాలోని 295 గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం, స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక పురోగతి కల్పించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం హైదరాబాద్ లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయితీ రాజ్ (NIRDPR) సంస్థ డైరెక్టర్ జనరల్ జి.నరేంద్రతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎన్టీఆర్ జిల్లా సమగ్ర అభివృద్ధికి, జిల్లాలోని 295 గ్రామాలు, పట్టణ ప్రాంతాలు మొత్తం కలిపి అభివృద్ధి చేయడానికి అవసరమైన అంశాలతో పాటు, స్వయం సహాయక సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు ఏ విధంగా మార్కెటింగ్ చేయాలి. నాణ్యమైన ఉత్పత్తులు ఏ విధంగా తయారు చేయించాలి. ఇందుకు వారి ఉపయోగపడే విధంగా ప్రతి మండలంలో కామన్ ఫెసిలిటీ సెంటర్స్ ఏర్పాటు గురించి, వాటి నిర్వహణ, విధివిధానాలపై కూలంకుషంగా చర్చించుకున్నారు. అదే విధంగా ఏ ప్రాంతాల్లో ఏ యూనిట్ పెడితే బాగుంటుందనే విషయం కూడా చర్చ సాగింది.

డైరెక్టర్ జనరల్ జి.నరేంద్ర మాట్లాడుతూ గ్రామీణాభివృద్ది కోసం సెంట్రల్ గవర్నమెంట్ అమలు చేస్తున్న పథకాలను జిల్లాలో ఎంపీ కేశినేని శివనాథ్ ముందుకు తీసుకువెళు తున్నందుకు అభినందనలు తెలిపారు. అలాగే దేశంలోనే ఎన్టీఆర్ జిల్లాను మోడల్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కన్సల్టెంట్ డాక్టర్ ఎమ్.డి. ఖాన్, ప్రోఫెసర్స్ డాక్టర్ కతిరేషన్, డాక్టర్ ఎ.కె.బాంజా, డాక్టర్ సంధ్య గోపాలన్, డాక్టర్ జ్యోతి మహంతి, డాక్టర్ నిత్య లతో పాటు కేశినేని ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు





- గణేష్ మంటపాలను తరుచూ సందర్శించి భద్రతపై సమీక్షించిన పోలీసులు
- నిమజ్జనం జరిగే ప్రాంతాలలో పటిష్ట బందోబస్తు... డ్రోన్లతో ప్రత్యేక నిఘా
- అనంత జిల్లా ఎస్పీ పి జగదీష్

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఆగస్టు 29:** అనంతపురం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ శాఖ అన్ని చర్యలు తీసుకుంటున్నదని గట్టి భద్రతా చర్యలు తీసుకున్నామని అనంతపురం జిల్లా ఎస్పీ పి జగదీష్ అన్నారులి జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా నిమజ్జనం జరిగే ప్రాంతాలలో మరింత అప్రమత్తంగా ఉన్నారు. నిమజ్జనం ప్రక్రియ ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా చూడాలన్న ఉద్దేశ్యంతో జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీసు అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికారులు మరియు సిబ్బంది ఆయా పరిధుల్లోని ప్రతీ మంటపాన్నీ సందర్శించి భద్రతను సమీక్షించారు. ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అని జిల్లా ఎస్పీ జగదీష్ తెలిపారు

విగ్రహాల నిమజ్జనం సమయంలో అనుసరించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. శోభాయాత్ర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా సహకరించాలని నిర్వాహకులకు సూచించారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ జగదీష్ కోరారు

- ఉత్సవాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచడానికి రాత్రి , పగలు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.లి జిల్లా ప్రజలందరూ పోలీసులకు సహకరించి, శాంతిభద్రతల పరిరక్షణకు తోడ్పడాలని జిల్లా ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు. ఏదైనా సహాయం కోసం లేదా సమాచారం కోసం వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌ను లేదా 112 నెంబర్ కు కాల్ చేయాలని జిల్లా ఎస్పీ పి జగదీష్ సూచించారు.

# పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.2కోట్లు స్పెషల్ గ్రాంట్ మంజూరు

- డిఎంఎఫ్ నిధుల ద్వారా అదనంగా రూ.6.75 కోట్లు మంజూరు
- పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక అభ్యర్థన మేరకు స్పందించిన మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి ఆగస్టు :29 :**శ్రీ సత్య సాయి జిల్లాపుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అభ్యర్థన మేరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ స్పందించి పుట్టపర్తి మున్సిపాలిటీకి అభివృద్ధికి స్పెషల్ గ్రాంట్ కింద రూ.2 కోట్లు మంజూరు చేశారు. పుట్టపర్తి మున్సిపాలిటీ లో త్రాగునీటి సరఫరాకు రోడ్ల నిర్మాణానికి కాలువ నిర్మాణానికి వీధిలైట్లు పార్కుల అభివృద్ధికి రాష్ట్ర పురపాలక శాఖ నుంచి పుట్టపర్తి మున్సిపాలిటీ నిధులు మంజూరైనట్లు తెలిపారు. అదేవిధంగా పుట్టపర్తి పడమర వైపు రోడ్డు నిర్మాణానికి , పుట్టపర్తి ఎయిర్పోర్ట్ రోడ్డు నుంచి కమ్మవారి పల్లి ఎక్స్ రోడ్డు వరకు, పుట్టపర్తి ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఉన్న రోడ్డు నుంచి బ్రాహ్మణపల్లి బీడుపల్లి రోడ్ ,సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రోడ్ వరకు రహదారి నిర్మాణానికి మొత్తం రూ.6కోట్లు డిస్టిక్ మినరల్ ఫండ్ కింద మంజూరైనట్టు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా కలెక్టర్ చేతన్ గారి సహకారంతో డిఎంఎఫ్ నిధుల ద్వారా 75 లక్షలు సీసీ రోడ్ల నిర్మాణానికి తెలిపారు.

# బై..బై.. గణేశా

- వైభవంగా అయోధ్య వినాయక నిమజ్జనం
- మచ్చా రామలింగారెడ్డి జర్నలిస్టు కాలనీలో ఉత్సహంగా ముగిసిన వినాయక ఉత్సవాలు





**అంకుశం ప్రతినిధి అనంతపురం ఆగస్టు 29:** ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అనంతపురం రూరల్ మండలం కొడిమి గ్రామంలోని మచ్చా రామలింగారెడ్డి జర్నలిస్టు కాలనీలోని కమ్యూనిటీ హాలులో జర్నలిస్టులు వినాయక చవతి నుంచి మూడురోజులుగా విశేష పూజలు నిర్వహించి ఉత్సహంగా వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించారు. మూడో రోజు పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించి ఆ తరువాత జర్నలిస్టు కాలనీ విధుల్లో వినాయకుడిని చక్కగా ఊరేగింపు చేసి అన్నదానం, ఊరేగింపు కార్యక్రమంలో పెద్ద ఎత్తున్న విలేకరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ డెవలప్మెంట్ సొసైటీ అనంతపురం జిల్లా కార్యదర్శి విజయరాజు, వైస్ ప్రెసిడెంట్ నగేష్, జాయింట్ సెక్రటరీ మల్లికార్జున, ఉత్సవ కమిటీ సభ్యులు హరికృష్ణ, సూర్య ప్రకాష్ రెడ్డి, విష్ణు, శీన, రామకృష్ణ జర్నలిస్టు కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అయోధ్య వినాయకుడిని శు క్రవారం సాయంత్రం ఘనంగా నిమజ్జనం చేశారు. నిమార్జనం అనంతరం అక్కడున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు

## తిరుమలలో ఘన వ్యర్థాల నిర్వహణపై టీటీడీ ఈవో సమీక్ష



**అంకుశం న్యూస్ తిరుమల ఆగస్టు 29:** తిరుమలలో ఘన వ్యర్థాల నిర్వహణపై టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో శ్యామల రావు మాట్లాడుతూ తిరుమలలో ఉత్పత్తి అవుతున్న తడి చెత్తను ఉపయోగించి బయో గ్యాస్, ఎరువులు తయారు చేయడం కోసం టీటీడీ%-%ఐఓసీఎల్ భాగస్వామ్యంతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విభజన అవసరం లేకుండా ఏవిధంగా వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయగలమో అలాంటి పద్ధతులను అన్వేషించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ప్రముఖ శాస్త్రవేత్త పద్మశ్రీ శరద్ ఖలే, బయోడిగ్రేడబుల్ వ్యర్థాలను ఉపయోగించి బయో గ్యాస్ ఉత్పత్తి చేయడం పర్యావరణ అనుకూల పరిష్కారం అని పేర్కొన్నారు. త్వరలో టీటీడీకి అనువైన ప్రణాళికను అందజేస్తానని హామీ ఇచ్చారు. అలాగే కూరగాయల వ్యర్థాలతో ఇళ్లలోనే సేంద్రియ ఎరువులు తయారీ విధానాన్ని ప్రదర్శించారు. ఈ సమావేశంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, ఈఈ సుధాకర్, డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మధుసూదన్, శాస్త్రవేత్తలు సందీప్ అసోలేకర్, శ్రీ బౌ నిపుర్తే తదితరులు పాల్గొన్నార

## ఈవీఎంల గోడౌన్లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చేతన్




**అంకుశం న్యూస్ పుట్టపర్తి, ఆగస్టు 29 :**శ్రీ సత్య సాయి జిల్లాలోని ధర్మవరం మార్కెట్ యార్డు నందు ఉన్న ఈవీఎం గోడౌన్లను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ టి. ఎస్.చేతన్ శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాలు, మార్గదర్శకాల ప్రకారం నెల వారి తనిఖీల్లో భాగంగా.. ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ల భద్రతకు తీసుకుంటున్న జాగ్రత్తలను ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా గోడౌన్ వద్ద సీసీ కెమెరా వ్యవస్థ, ఫైర్ సేఫ్టీ, 24 గంటల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు కొన్ని సూచనలు చేశారు. ఈవీఎంల భద్రతలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, భద్రతా నిబంధనలపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, తహశీల్దార్ సురేష్ బాబు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలైన బిజెపి నుండి సాకే ఓబులేసు, వై సి పి నుండి సాయి ప్రసాద్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుండి ఎం.ఆర్ కరీం, జే ఎస్ పి నుండి కే. రామంజనేయులు, బీఎస్పీ నుండి ఎస్.ఆంజనేయులు, సిపిఎం నుండి హరి,తదితరులు పాల్గొన్నారు.

## గిడుగు సేవలు స్ఫూర్తిదాయకం :

డాక్టర్ నల్లాని రాజేశ్వరి ఘన నివాళి



**అంకుశం న్యూస్ అనంతపురము, ఆగష్టు 29 :** తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతుల సేవలు స్ఫూర్తిదాయకమని ప్రముఖ సామాజికవేత్త, కాలమిస్ట్, కేంద్ర ప్రభుత్వ 'రాజ్యమహిళా సమ్మాన్' అవార్డు గ్రహీత డాక్టర్ నల్లాని రాజేశ్వరి అన్నారు. గ్రాంథికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుకభాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియజెప్పిన మహనీయుడనీ కొనియాడారు. గిడుగు జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని శు క్రవారం అనంతపురం నగరంలోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నల్లాని రాజేశ్వరి మాట్లాడుతూ, ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి గిడుగు మూలపురుషుడన్నారు. . . ఈ కార్యక్రమంలో ఏపీ గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, ఎస్.ఎస్.బి.ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. సరిత, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ నగరూరు రసూల్, వి. ఫిరోజా, ఎన్ఎస్ఎస్ పీవోస్ బాబా ఫక్రుద్దీన్, భార్గవి, సురేంద్ర, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలి

- రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా ఎస్పీ పి జగదీష్



**అంకుశం న్యూస్ అనంతపురం, ఆగస్టు 29 :** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో రోడ్డు భద్రత కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా రోడ్డు భద్రతా సమావేశాన్ని, ఎన్కొఓఆర్డీ (నార్కో కోఆర్డినేషన్ సెంటర్, NCORD) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతపురం నగరంలో 3 చోట్ల పార్కింగ్ లొకేషన్స్ ని గుర్తించగా, ఎన్ని అవసరమవుతాయో అన్ని గుర్తించాలన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం లో భాగంగా నిధులు ఉన్నాయని, ఎయిర్ పొల్యూషన్ తగ్గించడానికి ఆ నిధులను ఉపయోగించాలన్నారు. నగరంలో సప్తగిరి సర్కిల్ నుంచి జిజిహెచ్, టవర్ క్లాక్, తదితర రూట్లో చివర వరకు రోడ్డు ఉండాలని, డ్రైనేజీ ఉండాలని, ఇందుకు సంబంధించిన కసరత్తు చేయాలన్నారు. నగరంలో రోడ్లు అన్నీ బాగుండాలని, అన్ని రోడ్ల పనులు పూర్తి చేయాలన్నారు. నగరంలో పలు సర్కిల్స్ తర్వాత 50 మీటర్ల అనంతరం బస్సు నిలబడేంత స్థలంని రిక్వెస్ట్ స్టాప్ గా మార్కింగ్ ఇవ్వాలని, అన్ని స్టాప్ లలో బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీజిఎస్ అవగాహనలో భాగంగా, ప్రజలకు గంజాయి మరియు డ్రగ్స్ సంబంధిత రెండు ప్రశ్నలు అడుగుతున్నారని, దీన్ని అందరూ అధికారులు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను పాడుబడిన ప్రదేశాలలో నిరంతర విజువల్ పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయమని ఆదేశించారు. డ్రగ్స్ నివారణ అనేది ప్రభుత్వం 10 సూత్రాలలో భాగంగా ముఖ్యమైనదిగా తెలియజేయడం జరిగిందని, జిల్లాలో గంజాయిని అరికట్టాలన్నారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని, ఇందులో భాగంగా గుత్తి - గుంతకల్లు రహదారిలో అవసరమైన చోట సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, రేడియం స్టిక్కర్ వేయాలన్నారు. రోడ్డు భద్రతకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ఈగల్ వచ్చాక ఎయిర్ఫోర్స్మెంట్ పై ప్రత్యేక దృష్టి పెట్టి చేపడుతున్నామన్నారు. ప్రతి విద్యాసంస్థలో వారానికి ఒకసారి "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అవగాహన కార్యక్రమాలలో భాగంగా ప్రజలకు %జూా+టాజు% టోల్ ఫ్రీ నంబర్ 1972 గురించి తెలియజేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలుతీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, ఈఈ రాజగోపాల్, ఈఈ ప్రసాద్ రెడ్డి, డిఈ గురుప్రసాద్, డిఎస్పీ, డిటిసి వీర్రాజు, పిడి నేషనల్ హైవే తరుణ్, ఎస్ఈ పంచాయతీరాజ్ జహీర్ అస్లాం,, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్న ఎమ్మెల్యే నల్లమిల్లి


**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 29:** తెలుగు వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నేడు తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుంది. ఎందువలన ఈరోజు తెలుగుభాషా దినోత్సవంగా జరుపుకుంటున్నాం అంటే వ్యవహారిక భాషా పితామహుడుగా ఆధునిక వైతాళికుడిగా మనం తెలుగు దినపత్రికల్లో గాని వెలుగు పుస్తకాల్లో గాని ఏదైతే వ్యవహారిక భాష చూస్తా ఉన్నామో ఈ వ్యవహారిక భాషను తీసుకురావడం కోసం దానికి ఒక శైలి నిర్మాణం చేయడం కోసం వారు చేసిన కృషి అమోఘమైంది. ముఖ్యంగా ఆనాడు గ్రాంథిక భాషలో రచనలు ఉండే నేపథ్యంలో అవి సామాన్య ప్రజీనీకానికి అర్దం కాని



పరిస్దితులలో వాడుక భాషని ప్రాచుర్యంలోకి తీసుకురావాలని వారు కృషి చేయడం జరిగింది. ఇవాళ తెలుగు దినపత్రికలు గాని తెలుగు పుస్తకాలు గానీ వాడుతున్న భాష గిడుగు రామ్మూర్తి పంతులుగారు రచించినదే. వారు ఏర్పాటు చేసిందే. వారి నిఘంటువు ఆధారంగానే ఇవన్నీ మనకి అందుబాటులోకి వచ్చాయి. అటువంటి మహానుభావుడిని మనం ఎల్లవేళలా స్మరించుకోవాలి ఇవాళ తెలుగు భాష ఏ విధంగా ఉందో మనం చూస్తా ఉన్నాం ఇటువంటి పరిస్థితుల్లో భాషాభిమానులందరూ ఇవాళ గిడుగు రామ్మూర్తి జయంతిని అధికారింగా జరుపుకోవడం వలన మనకి ఇది ఇక్కడితో ఈ హాల్ మీటింగ్తో అయిపోయేది కాదు. అందరూ తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేయాలని అవసరం ఉంది అటువంటి మహానుభావుడు కృషి వల్ల ఇవాళ సంతరించుకున్న ఈ భాషని అంతరించిపోకుండా మన కాపాడుకోవాల్సిన బాధ్యత మనమందరికి మీద ఉంది. మీ అందరూ ఈరోజు ఎవరైతే ఈ కార్యక్రమానికి హాజరయ్యారో అందరూ తెలుగు భాషను కాపాడుకోవడంలో మీ అందరూ కీలక పాత్ర పోషించాలని మీ అందరికీ తెలియజేసుకుంటున్న అన్న అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ కూటమి నాయకులు ,తెలుగు మహిళలు, అనపర్తి టౌన్ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిటాల రవీంద్ర ఆశయాల కోసం పనిచేస్తాం







- పరిటాల రవీంద్ర ప్రతి గుండెలో బ్రతికే ఉన్నారు
- పరిటాల రవికి దేవుడు ఇచ్చిన తండ్రి ఎన్టీఆర్.. పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్
- రామగిరిలో పరిటాల రవీంద్ర, ఎన్టీఆర్ క్యాంస్య విగ్రహాల ఆవిష్కరణ
- వెయ్యి మందిరక్తదానం
- పరిటాల రవి ఆశయాల్ని శ్రీరామ్, సిద్ధార్థ ముందుకు తీసుకెళ్తున్నారు.. సునీత
- మమ్మల్ని నడిపిస్తున్న అభిమానుల రుణం తీర్చుకోలేనిది.. శ్రీరామ్

**అంకుశం న్యూస్ అనంతపురం ఆగస్టు 29:** మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ సీనియర్ నేతపరిటాల రవీంద్రకు మరణం లేదని.. ఆయన ప్రతి అభిమాని గుండె చప్పుడులో బ్రతికే ఉన్నారని.. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. రామగిరి మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణ పండుగ వాతావరణలో జరిగింది. రాప్తాడు నియోజకవర్గంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాదిమంది అభిమానుల మధ్య ఈ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ముందుగా పార్టీ కార్యాలయం వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, అనంతపురం, హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రుల సహకారంతో రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చి వెయ్యి యూనిట్లకు పైగా రక్తదానం చేశారు. ప్రతి ఒక్కర్నీ ఆప్యాయంగా పలుకరిస్తూ.. అభినందించారు. అలాగే బెంగళూరుకు చెందిన ఎం.ఎస్.రామయ్య ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు తొమ్మిది వందల ఎనభై మందికి ఇక్కడ వివిధ రకాల పరీక్షలు నిర్వహించి.. మందులు, కళ్ళ అద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం రామగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద కాంస్య విగ్రహాల ఆవిష్కరణ జరిగింది. ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ భారీగా తరలివచ్చిన అభిమాన జనసందోహం నడుమ విగ్రహాల్ని ఆవిష్కరించారు. అభిమానులు భారీ గజమాలను క్రేన్ సాయంతో ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాలకు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ పరిటాల రవీంద్ర విగ్రహాన్ని మా సొంత మండల కేంద్రంలో ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. మాకు ఆరాధ్య దైవంగా భావించే ఎన్టీఆర్ విగ్రహంతో పాటు పరిటాల రవి విగ్రహాలు ఏర్పాటు చేయాలని చాలా రోజులుగా కార్యకర్తలు, అభిమానులు కోరుతున్నారన్నారు. వారి అభిష్టం మేరకే ఈ విగ్రహాలను ఆవిష్కరించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావడమే కాకుండా రక్తదానం చేయడం చూస్తుంటే.. పరిటాల రవి జనం గుండెల్లో ఎంతగా గూడు కట్టుకున్నారో తెలుస్తోందన్నారు. రక్తదానం చేసిన ప్రతి అభిమానికి మా కుటుంబం తరుపున కృతజ్ఞతలు చెబుతున్నట్టు చెప్పారు. శనివారం రోజు పెనుకొండలో పరిటాల రవి కాంస్య విగ్రహావిష్కరణ జరుగుతోందని.. ఈ కార్యక్రమం కోసం ముందుకొచ్చిన మంత్రి సవితకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పెనుకొండ అంటే పరిటాల రవికి ఎంతో ఇష్టమైన ప్రాంతమని.. ఆయన ఆ రోజుల్లో ఇక్కడ పెత్తందారులకు, భూస్వాములకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలు ఎవరూ మర్చిపోలేరన్నారు. అరాచకం రాజ్యమేలుతున్న సమయంలో పరిటాల రవి ఇక్కడ ప్రజల పక్షాన నిలబడ్డారన్నారు. పరిటాల రవి ఆశయాలు ఎంతో గొప్పవని.. కానీ అలాంటి వ్యక్తి గురించి కొందరు విమర్శలు చేయడం వారి కుసంస్కారానికి నిదర్శనమన్నారు. ఎంతో మంది అన్నదాతలకు అండగా నిలిచారన్నారు. పేదింట పెళ్లిళ్లు చేసి పెద్ద దిక్కుగా నిలబడ్డారన్నారు. వేల మందితో రక్తదానం చేయించి ప్రాణాలు కాపాడారన్నారు. పరిటాల రవి ఆశయాలను ఆయన కుమారులు పరిటాల శ్రీరామ్, సిద్ధార్థలు ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. మరోవైపు పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ పరిటాల రవిని అభిమానించే వారు ఎక్కడ ఉన్నా జయంతి వేడుకలు జరుపుకుంటున్నారన్నారు. ఆయన కొడుకుగా పుట్టడం ఎంతో గర్వంగా ఉందని.. కానీ తండ్రి ప్రేమ నాకు చిన్న వయసులోనే దూరమైందన్నారు. కానీ ఆ



ప్రేమను వేలాది మంది అభిమానులు, కార్యకర్తలు మాకుటుంబానికి అందించారన్నారు. మమ్మల్ని ముందుండి నేటికీ నడిపిస్తున్నారని.. వారికి జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. పరిటాల రవి ఆరోజు పిలుపునిచ్చిన రక్తదాన యజ్ఞం నేటికీ ఇలా నిర్విఘ్నంగా సాగుతోందన్నారు. ఆయన ఇచ్చిన పిలుపుతో అభిమానులు ప్రతి జయంతి, వర్ధంతికి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇది ఎంతో మంది ప్రాణాలను నిలబెడుతోందన్నారు. నేను చిన్న వయసులోనే తండ్రికి దూరమయ్యానని.. అలాగే పరిటాల రవి కూడా తండ్రికి దూరమయ్యారన్నారు. ఆ తర్వాత ఆయనకు కొండపల్లి సీతారామయ్య, ఎన్టీఆర్ లు తండ్రి స్థానంలో ముందుండి నడిపించారన్నారు. తాను తన తాత పరిటాల శ్రీరాములును చూడలేదని.. కానీ తాతగా భావించి ఎన్టీఆర్ ను పరిటాల రవీంద్ర ద్వారా చూశానన్నారు. పరిటాల రవి ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలని, కరవు లేకుండా వలసలు లేకుండా చూడాలని తపించారన్నారు. అది పరిటాల సునీత సాధించారని కానీ అది చూసి సంతోషించేందుకు పరిటాల రవీంద్ర లేకపోవడం బాధ కలిగిస్తోందన్నారు. తమ కట్టె కాలే వరకు తెలుగుదేశం పార్టీలో సైనికుల్లా పని చేస్తామని.. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆశయాల కోసం నిలబడుతామని శ్రీరామ్ తెలిపారు. పెనుకొండ అంటే పరిటాల రవి.. పరిటాల రవి అంటే పెనుకొండ అనే ముద్ర ఉందని.. అలాంటి ప్రాంతంలో రవి విగ్రహం పెడుతుండటం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు మంత్రి సవితకు తమ కుటుంబంతో పాటు పరిటాల రవి అభిమానుల తరుపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పరిటాల రవి విగ్రహాల స్థాపన ద్వారా ఆయన ఈ ప్రాంతంలో చేసిన పోరాటాలు, పేదల పక్షాన నిలబడిన తీరు.. భావితరాలకు తెలియాలనే ఈ కార్యక్రమాలు చేస్తున్నట్టు శ్రీరామ్ తెలిపారు...

## అమ్మవారి ఆలయం నేటి నుండి కొత్త నిబంధనలు అమలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 29:** విజయవాడ ఇంద్రకీలాద్రి అమ్మవారి ఆలయంలో నేటి నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు తో కీలక ఆదేశాలు జారీ చేసిన దేవాదాయ ధర్మాదాయ శాఖదీనిప్రకారం సాంప్రదాయ దుస్తుల్లో మాత్రమే దర్శనాలకు రావాలి,అమ్మవారి ఆలయ ఆవరణలో సెల్‌ఫోన్ వాడకంపై నిషేధం, భక్తులు, ఉద్యోగులందరికీ సాంప్రదాయ దుస్తులు తప్పనిసరిఅని దేవాదాయ ధర్మాదాయ శాఖఆదేశాలు జారీ చేస్తున్నట్టు చెప్పారు.

**పరిటాల రవీంద్ర జయంతి కార్యక్రమం లో పాల్గొన్న ధర్మవరం డి.**


### ఎస్. పి కి మెమంటో అందజేస్తున్న పరిటాల సునీత



**అంకుశం న్యూస్ ధర్మవరం ఆగస్టు 29:** మండల కేంద్ర మైన రామగిరి లో పరిటాల జయంతి సందర్భంగా జరిగిన ఉచిత రక్త దాన శిబిరం విజయవంతం చేసిన సందర్భంగా పాల్గొన్న ధర్మవరం డి.ఎస్. పి. హేమంత్ కుమార్ కు మెమంటో అందజేస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ కార్యక్రమం లో ధర్మవరం టీడీపీ నాయకులు కత్తుల బాబ్జి తదితరులు పరిటాల అభిమానులు పలువురు పాల్గొన్నారు.

## నాట సారా పై కఠినంగా వ్యవహరించండి





- నాటసారా రహిత జిల్లాగా అనంతపురం ఉండాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,

**అంకుశం ప్రతినిధి అనంతపురం, ఆగస్టు 29 :** అనంతపురం జిల్లాలో ఎక్కడ నాటు సారా కనపడడానికి నాటు సారా తయారీదారులపైవీలులేదని కఠినంగా వ్యవహరించాలనినాటసారా రహిత జిల్లాగా అనంతపురం జిల్లాని ప్రకటించడమైనదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, పేర్కొన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో నవోదయం 2.0 పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 104 గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా ప్రకటించడం జరిగిందన్నారు. నాటుసారా నిర్మూలనపై ఎప్పటికప్పుడు రైడ్స్ చేయాలన్నారు. ఎక్సైజ్ పోలీస్ అధికారులు కూడా వేగవంతంగా ఆలోచించి నాటుసారాని దూరం పెట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందులోభాగంగా నవోదయం 2.0, నాటసార నిర్మూలన కార్యక్రమం.. కంట్రోల్ రూమ్ నంబర్ 14405.. నాటసారాని తరిమికొడదాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అంటూ ఎక్సైజ్ శాఖ రూపొందించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.

- ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, ఎక్సైజ్ సీఐలు సత్యనారాయణ, సునీల్, సాగర్, సోమశేఖర్, సునీత, జయనాథ రెడ్డి, ఎస్ఐ జకీర్, తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలకు ప్రతి యువత దూరంగా ఉండాలి

- దేశానికి మీరే ఆదర్శం- భావితరాలకు దిశా నిర్దేశనం
- డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన సదస్సులో పోలీసుశాఖ





**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 28:** విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విలువైన తమ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని మండపేట టౌన్ సిఐ డి సురేష్ తెలిపారు. మండపేట పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్రీ వాత్సా ఫంక్షన్ హాల్ లో విద్యార్థులతో నిర్వహించిన డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు. అంతే కాకుండా ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోక్సో చట్టం గురించి సవివరంగా తెలియజేయడం జరిగిందన్నారు. అలాగే ఈ డ్రగ్స్ వద్దు బ్రో అనే కార్యక్రమంపై సుమారు 600 మంది విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.10,81,000/- విలువ కలిగిన చెక్స్ ను 11 మంది పెషేంట్స్ కు అందజేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి

- సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 11కుటుంబాలకు రిలీఫ్



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఆగస్టు 29:** అనపర్తి రజక కమ్యూనిటీ హాల్ లో సీఎం సహాయ నిధి నుండి అనపర్తి నియోజకవర్గం సంబంధించిన 11 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.10,81,000/- విలువ కలిగిన చెక్స్ ను 11 మంది పెషేంట్స్ కు అందచేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గ ఎన్ డి ఏ నాయకులు, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బోయిళ్ళ, సీఐ భీమా నాయక్



**కనిగిరి ఆగస్టు 29 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని కందుకూరు రోడ్డులో మస్తానయ్య స్తూపం దగ్గర ఏర్పాటు చేసిన గణనాథుడికి సిఎస్ పురం మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, టిడిపి నాయకులు బోయిళ్ళ నారాయణరెడ్డి గత కొద్ది సంవత్సరాలుగా గణపతి బొమ్మను బహుకరిస్తూ, గత మూడు సంవత్సరాలుగా 1, 01,116 రూపాయలు భూరి విరాళంగా ఇస్తున్నారు. శుక్రవారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నీరు కట్టు నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో బోయిళ్ళ నారాయణరెడ్డి, సీఐ భీమానాయక్, పామూరు తాసిల్దార్ రామచంద్రుని వాసుదేవరావు విఘ్నేశ్వరుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీ వారు బోయిళ్ల నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు టి కిషోర్ బాబు, వెంకటేశ్వర నాయక్, కొండా నరసింహులు, వాయునేని రాఘవ, పిడుగు శ్రీనివాసులు, గుత్తి మహేష్, కోడిగుంపల నాయబ్ రసూల్, తోట రవి, వరికూటి హనుమంతు తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## అపశృతులు దొర్లకుండా గణేష్ నిమజ్జనం చేయండి

- జిల్లా ఎస్పీ పి.జగదీష్ సూచన
- రాచానపల్లి, పంపనూరు సమీపంలోని వినాయక నిమజ్జనం ప్రాంతాలను సందర్శించిన జిల్లా ఎస్పీ జగదీష్



**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం ఆగస్టు 29:** అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా... అపశృతులు దొర్లకుండా గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని పూర్తీ చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ సూచించారు. శుక్రవారం ఆయన రాచానపల్లి మరియు పంపనూరు సమీపంలోని వినాయక నిమజ్జనం ప్రాంతాలను జిల్లా ఎస్పీ గారు సందర్శించారు. గణేష్ ప్రతిమలను కాలువ నీటిలో నిమజ్జనం చేయడాన్ని పర్యవేక్షించారు. ఎలాంటి ఘటనలకు జరుగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా... నిమజ్జనం ప్రాంతాలలో వృద్ధులు, పిల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. నిమజ్జన ప్రక్రియకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బారికేడ్లు ఏర్పాటు చేయడం తో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆ రహదారి గుండా వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కల్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ వెంట అనంతపురం రూరల్ సి.ఐ శేఖర్ , పీఎస్సై సాయి, తదితరులు వెళ్లారు.